గణేశ్ మండపాలకు అనుమతి తప్పనిసరి

- రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి
- పోలీసులు ఆన్‌లైన్‌లో అనుమతు జారీ
- నిర్వాహకులు నిబంధనలు పాటించాలి
- డీజే వినియోగంపై నిషేధం

నిర్మల్‌టౌన్: ఈనెల 27న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో గణేశ్ మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు అనుమతి తప్పనిసరి తీసుకోవాలని ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. గణేశ్ నవరాత్రుల సందర్భంగా ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. ఈనేపథ్యంలో తెలంగాణ పోలీసు శాఖ నుంచి మార్గదర్శకాలు జారీ అయ్యాయి.

పోలీసు అనుమతి కోసం..

- ప్రతీ గణేశ్ మండప నిర్వాహకులు పోలీసు అనుమతి కోసం తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలి. గణేశ్ ప్రతిమ ఎత్తు, మండపం ప్రదేశం, నిమజ్జనం తేదీ, నిమజ్జనం ప్రదేశం తదితర వివరాలతో తెలంగాణ పోలీస్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. https://policeportal.tspolice.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపర్చాలి.
- రిజిస్ట్రేషన్ అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు ఆన్‌లైన్‌లో అనుమతులు జారీ చేస్తారు.
- అనుమతి పత్రం, క్యూఆర్ కోడ్, పోలీస్ సూచనలు మండపం వద్ద తప్పనిసరిగా ప్రదర్శించాలి.
- డీజే వినియోగంపై నిషేధం ఉంది.

విద్యుత్‌శాఖ నుంచి..

- విద్యుత్ కనెక్షన్ సంబంధించి ఆ శాఖ అనుమతి తీసుకోవాలి.
- మండపం వద్ద ఫ్లెక్సీల్లో కమిటీ సభ్యుల పేర్లు, బాధ్యత వహించే వారి నంబర్లు ఉంచాలి.
- నిమజ్జన సమయంలో ప్రతి ప్రతిమకు కనీసం 5 మంది సభ్యులు ఉండాలి.
- శబ్ద కాలుష్యం నివారణలో భాగంగా కేవలం రెండు స్పీకర్లు మాత్రమే ఉపయోగించాలి.
- వృద్ధులు, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా శబ్ద పరికరాలు పరిమితంగా వాడాలి.
- మండపంలో ప్రతీరోజు ఒక వలంటీర్ తప్పనిసరిగా ఉండాలి.
- అగ్నిప్రమాద నివారణ చర్యగా నీటి బకెట్లు, ఇసుక బస్తాలు తప్పనిసరిగా ఉంచాలి.

ప్రశాంతంగా జరుపుకోవాలి



గణేశ్ నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలి. పోలీసు శాఖ సూచించిన నిబంధనలను నిర్వాహకులు పాటించాలి. చట్ట విరుద్ధంగా అధిక శబ్ద పరికరాలను వాడొద్దు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– జానకీ షర్మిల, ఎస్పీ

తీరనున్న లోవోల్టేజీ సమస్య

- మహాగాం, కోలూరు, పల్సిలో సబ్‌స్టేషన్ల ఏర్పాటు
- నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- త్వరలో పనులు ప్రారంభం



సబ్‌స్టేషన్ స్థలాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ (ఫైల్)

భైంసారూరల్: ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్ అందిస్తోంది. రైతులు ఏటా రెండు పంటలు సాగు చేస్తున్నారు. అన్ని గ్రామాల్లో బోరుబావుల సంఖ్య పెరిగింది. వర్షాకాలంలో నీటి అవసరం ఉండదు. వేసవిలో పంటలకు నీరు ఎంతో అవసరం. అలాంటి సమయంలో లోవోల్టేజీతో బోరుమోటార్లు కాలిపోతున్నాయి. తరచూ విద్యుత్ ఉపకరణాలు, ఇళ్లలో టీవీలు, ఫ్యాన్‌లు ఇతర వస్తువులు కాలిపోతున్నాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. ఈ క్రమంలో రాష్ట్రప్రభుత్వం భైంసా మండలం మహాగాంలో రూ. 2.40 కోట్లు, తానూరు మండలం కోలూరులో రూ.2.40 కోట్లు, కుభీర్ మండలం పల్సిలో రూ.2.38 కోట్లతో సబ్‌స్టేషన్ మంజూరు చేసింది. భైంసా మండలంలోని మహాగాంలో ఏర్పాటు చేసే సబ్‌స్టేషన్ స్థలాన్ని ఇప్పటికే అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ పరిశీలించారు. సబ్‌స్టేషన్ ఏర్పాటు స్థలం, ఇతర వివరాలను ఉన్నతాధికారులకు పంపించారు. మూడు చోట్ల సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఏళ్లుగా వినియోగదారులు సబ్‌స్టేషన్ ఏర్పాటుకు వినతిపత్రాలు ఇస్తూనే ఉన్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి సబ్‌స్టేషన్ మంజూరు చేయడంతో మండలాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో లోవోల్టేజీ సమస్య తీరనుంది.

త్వరగా నిర్మాణం చేపట్టాలి



మహాగాంలో సబ్‌స్టేషన్ కోసం ఎదురుచూశాం. ఎట్టకేలకు సబ్‌స్టేషన్ మంజూరైంది. అధికారులు త్వరగా నిర్మాణ పనులు వేగవంతంగా జరిగేలా చూడాలి. – వెంకట్‌రావు, గ్రామస్తుడు

సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి

విద్యుత్ సరఫరాలో అంతరాయం రాకుండా రైతులకు ఇబ్బంది తలెత్తకుండా మూడు చోట్ల కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం జరుగనుంది. భైంసా మండలం మహాగాం, కుభీర్ మండలం పల్సి, తానూరు మండలం కోలూరు సబ్ స్టేషన్లు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి.

– రామారావు పటేల్, ఎమ్మెల్యే

వేస్ట్ ఫుడ్ కంపోస్ట్ ఎరువు మిషన్

కడెం: కేజీబీవీల్లో వృథాగా పడేసే ఆహార పదార్థాల ద్వారా కంపోస్ట్ ఎరువు తయారీ చేసే మిషన్ కడెం కేజీబీవీలో ఏర్పాటు చేశారు. ఈ యంత్రం ద్వారా వేస్ట్ ఫుడ్, కంపోస్ట్ ఎరువుగా మారి కూరగాయాల, పూల మొక్కలకు ఉపయోగపడనుంది. మంగళవారం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ యంత్రాన్ని ప్రారంభించనున్నట్లు ఎస్‌వో విమల తెలిపారు.

లోలెవెల్ వంతెన దాటి విధులు..



వరదనీటి నుంచి విధులకు వెళ్తున్న పంచాయతీ కార్యదర్శులు

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు లింబా(బి)లో లోలెవెల్ వంతెన పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. భైంసా మండలం చింతల్‌బోరికి చెందిన సురేష్, కుభీర్ మండలం పార్డి (బి)కి చెందిన భూమేష్, కుంటాల మండలం లింబా(బి) గ్రామానికి చెందిన రవిప్రసాద్ పంచాయతీ కార్యదర్శులు సోమవారం వరద ప్రవాహం నుంచి వెళ్లి విధులు నిర్వర్తించారు.

విగ్రహం ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలి



భైంసాటౌన్: నిరసన తెలుపుతున్న రజక, బీసీ, ఇతర సంఘాల నాయకులు

భైంసాటౌన్: తానూరు మండలంలోని భోసి గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రజక, బీసీ, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం అక్కడి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం ర్యాలీగా వెళ్లారు. సబ్ కలెక్టర్ అజ్మీరా సాంకేత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఐలమ్మ విగ్రహం ధ్వంసం చేసినవారిని వెంటనే గుర్తించి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విగ్రహం స్థానంలో నూతనంగా కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని వినతిలో కోరారు. నాయకులు సుంకెట పోశెట్టి, మహేశ్, నందు, దిగంబర్, సాయి, దిలీప్, శంకర్, ఆనంద్, దేవిదాస్ హస్సే పాల్గొన్నారు.

దుండగులను శిక్షించాలి

తానూరు: భోసి గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని మున్నూరుకాపు తాలూకా అధ్యక్షుడు రోళ్ల రమేశ్ డిమాండ్ చేశారు. మండలంలోని భోసి గ్రామాన్ని సోమవారం సందర్శించి గ్రామస్తులతో వివరాలను తెలుసుకున్నారు. ధ్వంసమైన విగ్రహ స్థానంలో కాంస్య విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. సభ్యులు తోట రాము, చుక్క బొట్ల భోజన్న, భైంసా ఆత్మ చైర్మన్ సిద్ధంవార్ వివేకానంద, నాయకులు అనిల్, నాగనాథ్, గోపాల్, మాణిక్‌దాస్ ఉన్నారు.

కుంటాల: భోసి గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుతూ రజక సంఘం సభ్యులు తహసీల్దార్ కమల్‌సింగ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. నాయకులు పథకంటి దత్త్రాద్రి, సిబ్బిల దత్తు, కాశీరాం గజేందర్, ఆలూరు ప్రవీణ్, ఎ.గజ్జారాం, ఎ.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కడెం: గోదావరి వంతెనపై అధికారులు,నాయకులు



గేట్ల మార్గంలో తాళ్లతో మూసివేస్తున్న పోలీసు సిబ్బంది

కడెం: ఎస్సారెస్పీ వరద గేట్లు ఎత్తడంతో మండలంలోని చిన్నబెల్లాల్ గోదావరి రేవును తహసీల్దార్ ఆర్.ప్రభాకర్, ఎంపీడీవో అరుణ,ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్ సోమవారం సందర్శించారు. వంతెన వద్ద, గోదావరి పరివాహక ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపీవో కవిరాజు, ఆర్‌ఐ శారద, నాయకులు ఉన్నారు.

తానూరు: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనంద్ రావు పటేల్ అన్నారు. సోమవారం నందిగాం, సింగాన్‌గాం గ్రామాల్లో పర్యటించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టం జరిగిన వివరాలను నమోదు చేసుకోవాలని ఫోన్ ద్వారా ఏవో మనిషాకు సూచించారు. ఏఎంసీ డైరెక్టర్ మౌలాఖాన్, నాయకులు ఉన్నారు.

రాకపోకలు బంద్

కుభీర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బెల్గాం వద్ద ఉన్న లోలెవల్ బ్రిడ్జి వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. ఎంపీడీవో సాగర్‌రెడ్డి, ఎంపీవో మోహన్‌సింగ్, ఎస్సై క్రిష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు కమల్‌సింగ్, ముజాయిత్‌ఖాన్ ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. బ్రిడ్జ్ కోతకు గురైనట్లు గమనించి రాకపోకలు నిలిపివేయించి బెల్గాం, బెల్గాంతండా ప్రజలను అప్రమత్తం చేశారు.

గడ్డెన్నవాగుకు సందర్శకులు రావొద్దు

భైంసాటౌన్: పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు సందర్శకులు రావొద్దని పట్టణ సీఐ జి.గోపినాథ్ సూచించారు. సోమవారం ప్రాజెక్టు దిగువన గేట్ల వైపు వెళ్లకుండా దారిని మూసివేశారు. ఎగువన భారీ వర్షాలతో ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోందని, ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతుండడంతో చూసేందుకు పట్టణ ప్రజలు తరలివస్తున్నారని అన్నారు. అయితే గేట్ల వద్ద ప్రమాదకరంగా వరదనీరు ప్రవహిస్తున్న నేపథ్యంలో సందర్శకులు గేట్ల వద్దకు రావొద్దని ఓ ప్రకటనలో కోరారు.

కూలిన ఇల్లు పరిశీలన

భైంసారూరల్: భారీ వర్షాలకు ఎగ్గాం, తిమ్మాపూర్ గ్రామాల్లో ఇబ్బందులు ఎదురవుతున్న పరిస్థితిని ఆర్‌ఐ దత్తాత్రి సమీక్షించారు. తిమ్మాపూర్‌లో శిథిలావస్థలో ఉన్న నాలుగు ఇళ్లు కూలిపోవడంతో అక్కడి పరిస్థితి తెలుసుకున్నారు. నష్టం వివరాలను నమోదు చేసుకున్నారు. శిథిల దశకుచేరుకున్న ఇళ్లలో జనం ఉండకుండా జాగ్రత్త పడాలన్నారు. ఆయన వెంట కార్యదర్శి ప్రియాంక తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: కురుస్తున్న వర్షాలకు జోహర్‌పూర్‌లో మూడు ఇళ్లు, అర్లి–గొడిసెరాలో 1, మన్మద్ 1 ఇళ్లు కూలిపోయాయి. తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఆర్‌ఐ ప్రమోద్ సోమవారం పరిశీలించారు. కార్యదర్శులు ఉన్నారు.

ఖానాపూర్‌లో భారీ వర్షం

ఖానాపూర్: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా గత నాలుగు రోజులుగా ఖానాపూర్‌లో వర్షం కురుస్తోంది. సోమవారం 24.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

పంటల పరిశీలన

తానూరు: మండలంలోని జౌలా(కే), కళ్యాణి గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న కూరగాయాలు, ఆయిల్‌పాం పంటల సాగును సోమవారం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి బీవీ రమణ పరిశీలించారు. భైంసా డివిజన్ ఉద్యాన అధికారి షేక్ జావేద్ పాషా, ఉద్యాన విస్తీర్ణ అధికారి మోహిని, ఆయిల్‌పాం క్లస్టర్ అధికారి యోగేష్, రైతులు ఉన్నారు.

ప్రజలు వెళ్లవద్దు

ఖానాపూర్: ఎస్సారెస్పీలో భారీ వరద కారణంగా గేట్లు ఎత్తనుండడంతో ఎస్సారెస్పీ దిగువన గల గోదావరి పరీవాహక ప్రజలు కొద్ది రోజుల పాటు గోదావరి వరకు వెళ్లొద్దని మండల ప్రత్యేకాధికారి జీవరత్నం, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రమాకాంత్ అన్నారు. మండలంలోని గోదావరి పరివాహకంలోని సుర్జాపూర్, మేడంపల్లి, బాదనకుర్తి, దిలావర్‌పూర్, బావాపూర్(కె), ఖానాపూర్, మస్కాపూర్, తదితర గ్రామాల్లో ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. ఎస్సై రాహుల్ గైక్వాడ్, ఎంపీవో రత్నాకర్‌రావు ఉన్నారు.

గోదావరి వరద ఉధృతి పరిశీలన

దస్తురాబాద్: దేవునిగూడెం, భూత్కూర్, రాంపూర్, మున్యాల, గోడిసీర్యాల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ విశ్వంబర్ పేర్కొన్నారు. గోదావరి ఉధృతిని సోమవారం పరిశీలించారు. శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టుల నుంచి వరద నీటిని భారీగా దిగువకు విడుదల చేస్తున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్ జయంతి



నిర్మల్‌టౌన్: నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్, గౌడ సంఘం నాయకులు

నిర్మల్‌టౌన్: సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద గల ఆయన విగ్రహానికి కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తితో హక్కులు సాధించుకోవాలని కమిషనర్ తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి ఎం.సీ లింగన్న, మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో నాయకులు రాజేందర్‌గౌడ్, ఒల్లాల చిన్న సర్సాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కడెం: మండల కేంద్రంలో పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శేఖర్‌గౌడ్, రాజేశ్వర్‌గౌడ్, రవీందర్‌గౌడ్, దశిగౌడ్, రాజాగౌడ్, మల్లేశ్‌గౌడ్, రాజేష్ గౌడ్, శ్రీనుగౌడ్, టి. శ్రీనుగౌడ్ పాల్గొన్నారు.

ఆలయాల్లో సందడి



పాపహరేశ్వర ఆలయంలో బారులు తీరిన భక్తులు



పాదయాత్రలో భారీగా తరలివచ్చిన భక్తులు

దిలావర్‌పూర్/నిర్మల్‌టౌన్: దిలావర్‌పూర్ మండలంలోని కదిలి పరిసర అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీమాతన్నపూర్ణ పాపహరేశ్వరాలయం, కాల్వ పరిసర అటవీప్రాంతంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి తరలిరావడంతో ఆలయం సందడిగా మారింది. స్వామివారి దర్శనం కోసం క్యూలో బారులు తీరారు. అనంతరం దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్లు నార్వాడి వెంకట్‌రావు, అంగూరి మహేందర్ తెలిపారు. లోక కల్యాణం కోసం జిల్లా కేంద్రంలోని నటరాజ్ నగర్ శివాలయం నుంచి కదిలి పాపహరేశ్వర స్వామి ఆలయం వరకు సాయిదీక్ష సేవాసమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పాదయాత్ర చేపట్టారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీమారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ శివాలయంలో పూజలు చేసి పాదయాత్రను ప్రారంభించారు. జోరువానలో శివనామ స్మరణంతో కాలినడకన తరలివచ్చారు. ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి తమ ఉపవాస దీక్షలు విరమించారు.

భక్తుల ప్రత్యేక పూజలు

కుంటాల/నిర్మల్/బాసర/తానూరు/లోకేశ్వరం: శ్రావణమాసం చివరి సోమవారం పురస్కరించుకుని జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చెత్తాచెదారం లేకుండా చూడాలి

లోకేశ్వరం: గ్రామాల్లోని వీధుల్లో చెత్తాచెదారం లేకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. మండలంలోని నగర్, బాగాపూర్ గ్రామాల్లోని వీధులను సోమవారం పరిశీలించారు. ప్రతీ వీధుల్లో ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరించాలన్నారు. నర్సరీలోని మొక్కలను తరలించి నాటేలా చూడాలన్నారు. ఎంపీడీవో సోలమాన్‌రాజ్, కార్యదర్శి ఉన్నారు.

గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా మూర్తి ప్రభాకర్

నిర్మల్‌చైన్‌గేట్: గణేష్ ఉత్సవ సమితి పట్టణ అధ్యక్షుడిగా మూర్తి ప్రభాకర్‌ను ఎన్నుకున్నట్లు రాష్ట్రీయ స్వయం సేవక సంఘ జిల్లా సంఘ చాలకుడు నూకల విజయ్‌కుమార్ తెలిపారు. పూర్తి కమిటీ మరో రెండు రోజుల్లో ప్రకటిస్తామని పేర్కొన్నారు. వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు పతికే రాజేందర్, అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, సుధాకర్, రవి, ఆనంద్, పార్థసారధి నరేందర్, కపాల్, అనిల్, సతీశ్, నరేశ్, రమేశ్, మురళి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

'పార్టీని బలోపేతం చేస్తాం'

నిర్మల్‌చైన్‌గేట్: సీపీఐ పార్టీని బలోపేతం చేసి రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తామని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పద్మ కుమారి అధ్యక్షతన సోమవారం జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ రంగాలకు తొత్తుగా వ్యవహరిస్తుందన్నారు. కేంద్రం తీసుకువచ్చిన కార్మిక రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల సాధన కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా ఎస్ఎన్‌రెడ్డి, భూక్య రమేశ్, వెంకటేశ్వర్, ఎస్.కై లాస్, పి.పద్మకుమారి, పి.గోపి, పి.ముత్యం ఎన్నికయ్యారు.

సంక్షిప్తంగా

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కుంటాల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని డీఎల్‌పీవో సుదర్శన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను సోమవారం పరిశీలించారు. మురుగుకాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి, మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలన్నారు. ఎంపీవో రహీంఖాన్, పంచాయతీ కార్యదర్శి రాజబాపు ఉన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

కుంటాల: పాఠశాలల్లో విద్యార్థులకు అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని డీఎల్‌పీవో సుదర్శన్ పేర్కొన్నారు. కుంటాల ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరంలో మాట్లాడారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యురాలు శృతిరెడ్డి సూచించారు. ఎంఈవో ముత్యం, ఎంపీవో రహీంఖాన్, పంచాయతీ కార్యదర్శి రాజబాపు, హెచ్‌డబ్ల్యూఓ, హెల్త్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యలపై పరిష్కార వేదిక

నిర్మల్‌చైన్‌గేట్: టీజీఎన్పీడీసీఎల్ నిజామాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు డీఈ నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. నిర్మల్ మండల కేంద్రంలోని పవర్ హౌస్ కాంపౌండ్‌లో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరిగే వేదికలో వినియోగదారుల విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు.

మహాగర్జన విజయవంతం చేయండి

కుంటాల: ఈనెల 22న భైంసా సురలోక్ గార్డెన్‌లో దివ్యాంగుల చేయూత పెన్షన్‌దారుల కోసం మంద కృష్ణ ఆధ్వర్యంలో తలపెట్టిన మహాగర్జనను విజయవంతం చేయాలని ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాయక్‌వాడ్ గంగాధర్, సొసైటీ డైరెక్టర్ గోనె గజ్జారాం పిలుపునిచ్చారు. మండలంలోని లింబా(కె) గ్రామంలో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలు దాటిన ఆసరా పెన్షన్ రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు ఇవ్వడం లేదన్నారు. జిల్లా నాయకులు దిగంబర్, ఆనంద్, శంకర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంఘటితంగా ఉంటేనే భవిష్యత్తు

భైంసాటౌన్: హిందువులంతా సంఘటితంగా ఉంటేనే భవిష్యత్తు ఉంటుందని వీహెచ్‌పీ నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలోని వేంకటేశ్వరాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి, స్థాపన దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ నారాయణ మాట్లాడుతూ హిందువులపై జరుగుతున్న దాడులను ముక్తకంఠంతో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కృష్ణాష్టమి పర్వదినం ప్రాముఖ్యత వివరించారు. వీహెచ్‌పీ జిల్లా సహకార్యదర్శి నవీన్, నగర కార్యదర్శులు కృష్ణ, రాజు, గంగాధర్, సురేష్, మహిళలు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహ నిర్మాణానికి పూజ

కడెం: చిన్నబెల్లాల్, నర్సింగాపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేయనున్న ఛత్రపతి శివాజీమహారాజ్ విగ్రహ నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. నెల రోజుల్లో విగ్రహ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని నిర్వాహకులు తెలిపారు. రిటైర్డ్ ఆర్మీ జవాన్ ఆది మల్లేశ్, రాకేశ్, భూమన్న, వెంకటేశ్ ఉన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

ముధోల్: మండలకేంద్రంలోని ఆయా శాఖల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులకు ప్రభుత్వం పంద్రాగస్టు సందర్భంగా ఉత్తమ అవార్డులు అందజేసింది. సోమవారం ముధోల్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీలత, ఎస్సై బిట్ల పెర్సిస్, పంచాయతీ ఈవో అన్వర్ అలీని సన్మానించారు. సభ్యులు రమేష్, సుదర్శన్, రమేష్, జీవన్ ఉన్నారు.

బెల్లాల్ వాసికి అంబేద్కర్ అవార్డు

కడెం: మండలంలోని పెద్దబెల్లాల్ గ్రామానికి చెందిన కొత్తపల్లి రాజేశ్వర్ అంబేద్కర్ అవార్డు అందుకున్నాడు. మహారాష్ట్రలోని సోలాపూర్‌లో ఆదివారం మోక్సికో టోలాస యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సామాజిక సేవా విభాగంలో అవార్డు అందుకున్నాడు.

క్లుప్తంగా

వైద్యశిబిరం సందర్శన



పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

మామడ: మండలంలోని పరిమండల్ గ్రామంలో సోమవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని స్థానికసంస్థలు జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సందర్శించారు. వైద్యశిబిరం రికార్డులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు. డీఎంహెచ్‌వో రాజేందర్, డీపీవో శ్రీనివాస్, ఎంపీడీవో సుశీల్‌రెడ్డి ఉన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు



ఆలూరులో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

సారంగాపూర్: మండలంలోని ఆలూరు, జౌళి గ్రామాల్లో వైద్యాధికారి అబ్దుల్ జవాద్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. జౌళి గ్రామంలో 39 మందికి, ఆలూరు గ్రామంలో 47మంది రోగులను పరీక్షించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జ్వరాల తీవ్రత అధికంగా ఉన్నవారిని గుర్తించి వారి రక్తనమూనాలు సేకరించారు. పరీక్షల అనంతరం వారికి అవసరమైన మందులు అందిస్తామని వైద్యాధికారి తెలిపారు. ఆరోగ్య పర్యవేక్షకుడు కృష్ణమోహన్‌గౌడ్, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం గ్రామంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రత్యూష ఆదేశాలతో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్యసిబ్బంది రక్త నమూనా సేకరించి మందులు అందించారు. ఇందులో వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో నిర్వహించాలి



వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రీ ప్రైమరీ పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రం అందజేశారు. విద్య బోధన బాధ్యతను అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్లకు ఇవ్వాలన్నారు. విద్య వలంటీర్స్‌కు నిర్ణయించిన వేతనాన్ని అంగన్‌వాడీలకు అదనంగా చెల్లించాలన్నారు. ఆరేళ్లలోపు పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లు నడపడానికి అనుమతి ఇవ్వొద్దన్నారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి వి.శైలజ, ఉపాధ్యక్షురాలు రజియా, బి.ప్రసాద, రమ్య, జిల్లా సహాయ కార్యదర్శి భాగ్య, రాజమణి, గీత, పద్మ, గంగామణి, సావిత్రి, భాగ్య, నర్సమ్మ, సత్య, సునీత, రాజేశ్వరి, శ్రీవాణి పాల్గొన్నారు.

పేకాటస్థావరాలపై దాడి

నిర్మల్‌రూరల్: మండలంలోని ముతాపూర్ శివారులో సోమవారం రాత్రి పేకాట స్థావరాలపై ఏఎస్పీ రాజేష్ మీనా ఆధ్వర్యంలో రూరల్ పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఓ ఫామ్‌హౌస్‌తోపాటు, గ్రామ శివారులోని మరో స్థావరంలో పేకాట ఆడుతున్న సమాచారంతో దాడి చేశారు. పేకాడుతున్న 20 మందిని అరెస్టు చేశారు. రెండు చోట్ల దాడుల్లో మొదటగా 9 మందిని, ఓ కారు, రూ. 6790 నగదు, రూ.14,500 ఆన్‌లైన్ నగదు స్వాధీనం చేసుకున్నారు. మరోచోట 11 మందిని, మూడు కార్లు, 11 సెల్‌ఫోన్లు, రూ.75,800 నగదు, రూ.82 వేల ఆన్‌లైన్ నగదు స్వాధీనం చేసుకున్నారు.

పరామర్శ

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన గాద్పు చందు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్ సోమవారం బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అంతకుముందు పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఇటీవల ఉత్తమ డీలర్ ప్రశంస పత్రాన్ని అందుకున్న హిందూ ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లాడి వెంకటేశ్వర్లును సన్మానించారు. నాయకులు ఆకుల శ్రీనివాస్, రాజేందర్, కీర్తి మనోజ్, రమేష్, అనిల్‌రావు, సురేందర్, శ్రావణ్, శ్రీనివాస్, నారాయణ, పరమేశ్వర్‌గౌడ్ ఉన్నారు.